క్లుప్తంగా

5 వేల మందికి అన్నదానం



గొల్లప్రోలులో అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు తదితరులు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో వేంచేసిన ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పెండెం దొరబాబు ప్రారంభించారు. సుమారు 5 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వైఎస్సార్ సీపీ నేతలు మొగలి అయ్యారావు, పర్ల రాజా, తెడ్లపు చిన్నారావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ



శరభవరం, గజ్జనపూడి గ్రామాల భక్తులు చేపట్టిన గిరియాత్ర

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని శరభవరం, గజ్జనపూడి గ్రామాలకు చెందిన భక్తులు మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి కొలువైన ఎర్రకొండ చుట్టూ ఆదివారం గిరియాత్ర (గిరి ప్రదక్షిణ)నిర్వహించారు. శరభవరం, గజ్జనపూడి, చింతలూరు, వాకపల్లి, పోతులూరు మీదుగా 13 కిలో మీటర్ల మేర గిరి యాత్రను చేపట్టారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగాణంలో భారీ అన్నదానం నిర్వహించారు. శరభవరం, గజ్జనపూడి పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



కరాటే పోటీల్లో విజేతలైన లంపకలోవ కరాటే స్కూల్ విద్యార్థులు

ప్రత్తిపాడు: జగ్గంపేట ప్రభుత్వోన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో లంపకలోవ కరాటే స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బూస్ కరాటే అకాడమీ నిర్వహించిన ఈ పోటీల్లో లంపకలోవ కరాటే స్కూల్ నుంచి 18 మంది పాల్గొనగా అందరూ విజేతలుగా నిలిచారని కరాటే మాష్టారు పి.బుజ్జి తెలిపారు. ఈ పోటీల్లో పి.అర్జున్ (రాచపల్లి), జి.తేజ (ఒమ్మంగి), ఎస్.కృష్ణ, ఆర్.పృథ్వీ, (గోకవరం), ధర్మవరం గ్రామానికి చెందిన కె భరణి, ఫణీంద్రలకు ప్రథమ స్థానం లభించిందన్నారు. ఒమ్మంగి గ్రామానికి చెందిన జె.అలేఖ్య, ఎస్. సాయి, రాచపల్లికి చెందిన ఆర్.గౌతమి, ధర్మవరం గ్రామానికి చెందిన డి.సాయి, జె.వైష్ణవిలకు ద్వితీయ స్థానం, తృతీయ స్థానంలో ఎన్.ప్రవీణ్ (రాచపల్లి), ఒమ్మంగికి చెందిన జి.హర్ష, జి.వరుణ్, గోకవరానికి చెందిన కె.బాబు, ధర్మవరం గ్రామానికి చెందిన పి.కుసుమాంజలి, డి.రమణ నిలిచారని ఆయన వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయా గ్రామాల నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం–వెల్దుర్తి రోడ్డులో ఆదివారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కాకినాడకు చెందిన అనిల్ కుమార్ కరప మండలం కరప, నడకుదురు గ్రామాలకు చెందిన మరో ఇద్దరితో కలిసి ద్విచక్ర వాహనంపై ధర్మవరం వచ్చారు. తిరిగి వెళ్తుండగా ధర్మవరం–వెల్దుర్తికి మధ్యలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో దిచక్ర వాహనం నడుపుతున్న అనిల్ కుమార్‌కు కాలు విరిగిపోగా, మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

శంఖవరం: మండలంలోని కత్తిపూడి కొండవారి పేటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి ఓం ఫౌండేషన్ సభ్యులు చేయూతను అందించారు. బాధితురాలు వల్లూరి సత్యవతి కుటుంబానికి నిత్యావసరాలు, బియ్యం, కిరాణా సరకులు, చాపలు, దుప్పట్లు, దుస్తులు, నగదు అందజేశారు. బాధితులను ప్రభుత్వంతో పాటు మిగతా స్వచ్ఛంద సేవా సంస్థలు ఆదుకోవాలని కోరారు. ఓం ఫౌండేషన్ సభ్యులు సుర్ల శ్రీను, మెగిలి శ్రీను, అవాల శ్రీను, కొరుప్రోలు ప్రసాద్, షేక్ జిలానీ పాల్గొన్నారు.

అదే తీరు.. తగ్గని భక్తజన హోరు

- పాదగయకు రెండో రోజూ పోటెత్తిన భక్తులు
- స్వామివారికి లింగోద్భవ అభిషేకాలు, ప్రత్యేక పూజలు
- వైభవంగా కుక్కుటేశ్వరస్వామి రథోత్సవం



లింగోద్భవ అభిషేకాల అనంతరం విశేష అలంకరణలో దుర్గాద రామలింగేశ్వరస్వామి వారు



స్వామి వారి ఉత్సవమూర్తుల పల్లకీపై ఊరేగిస్తున్న భక్తులు



కుక్కుటేశ్వరస్వామికి లింగోద్భవ అభిషేకాలు చేస్తున్న అర్చకులు

పిఠాపురం: మహాశివరాత్రిని పురస్కరించుకుని దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రానికి రెండో రోజు ఆదివారం కూడా భక్తులు పోటెత్తారు. సుమారు 20 వేల మందికి పైగా భక్తులు పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఉదయం నుంచి పాదగయ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున లింగోద్భవ పూజల అనంతరం భక్తులు ఆలయంలోని కుక్కుటేశ్వరస్వామి దర్శనానికి బారులుతీరారు. కుక్కుటేశ్వరస్వామిని అభిషేకాలు, రాజరాజేశ్వరీదేవి అమ్మవారిని లక్ష కుంకుమార్చన, లక్షచామంతి పూజలతో సేవించారు. పండితులు ఉదయం 8 గంటలకు స్వామి, అమ్మవార్లకు పంచామృత అభిషేకం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది తరలిరావడంతో పట్టణంలో వీధులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. నియోజకవర్గంలో పలు శివాలయాల్లో లింగోద్భవ అభిషేకాలు నిర్వహించారు.

కనుల పండువగా రథోత్సవం

స్థానిక ఉమాకుక్కుటేశ్వరస్వామి వారి దివ్య రథోత్సవం ఆదివారం రాత్రి కనులపండువగా జరిగింది. మధ్యాహ్నం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆధ్వర్యంలో అర్చకులు వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలతో నాకబలి, దండాడింపు, దొంగలదీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆలయం నుంచి కుంతీమాధవ స్వామి వారి ఆలయం వద్ద ఉన్న రథాలపేట వరకూ తీసుకువచ్చారు. రాత్రికి విచిత్ర వేషధారణలు, బ్యాండు మేళాల నడుమ విద్యుత్ దీపాలు పూలమాలలతో విశేషంగా అలంకరించిన రథంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి రథోత్సవాన్ని ప్రారంభించారు. మెయిన్‌రోడ్డు మీదుగా ఉప్పాడ సెంటర్ వరకూ కొనసాగిన రథోత్సవానికి అశేష భక్త జనవాహిని కదిలి వచ్చి స్వామివారి రథాన్ని లాగారు. స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉప్పాడ సెంటర్లో భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, ఆలయ ఈఓలు ఆర్.సౌజన్య, శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్యేక పూజలతో రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని శైవ క్షేత్రాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక బాలాత్రిపుర సుందరీ సమేత రాజశేఖరస్వామికి అర్చకులు శర్మ, సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం చేశారు. స్వామివారి కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. భక్తులు లలితాపారాయణ చేశారు. సోమవారం స్వామివారి రథోత్సవం, కోలాటం, మంగళవారం శ్రీపుష్పయగంతో స్వామివారి కల్యాణోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉప్పాడలో మత్స్యలింగేశ్వరస్వామి, చౌడేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి, గోర్స, నాగులాపల్లిలోని ఉమా రామలింగేశ్వరస్వామి, మూలపేటలో కేదారేశ్వరస్వామి, ఎండపల్లిలో కరకంతేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ఉప్పాడలో మత్స్యలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న పండితులు

కోలాహలంగా భీమేశ్వర రథోత్సవం

- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు
- భారీగా పోలీసు బందోబస్తు



పంచారామ క్షేత్ర రథోత్సవంలో కొమ్ము, కోయ నృత్యాలు



రథోత్సవంలో పాల్గొన్న దవులూరి దొరబాబు

సామర్లకోట: పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి రథోత్సవం పట్టణంలో కోలాహలంగా జరిగింది. ఆదివారం సాయంత్రం ఎంపీ వంగా గీత, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, అయ్యరక కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, బొడ్డు వెంకటరమణ రథోత్సవాన్ని ప్రారంభించారు. గోదావరి కాలువ ఆవలివైపు ఉన్న ఆలయం నుంచి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను రైల్వే గేటు మీదుగా గాంధీచౌక్, పెద్దవీధి, బళ్లమార్కెట్ సెంటర్, గొల్లగూడెం, నీలమ్మచెరువు, దేవీచౌక్ మీదుగా తిరిగి గాంధీచౌక్‌కు రథోత్సవం చేరింది. స్వామివారిని తిలకించడానికి దారి పొడవునా భక్తులు బారులు తీరి మొక్కులు తీర్చుకున్నారు.

రథోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఏలూరు కళాకారులచే హనుమంతుని వేషం, పొడుగు కాళ్ల ప్రదర్శన, డాల్స్, జగన్నాథపురం వారిచే కాంతార, కాళీమాత, రెక్కల నృత్యం, కొమ్ము, కొయ్య నృత్యం, సామర్లకోట కళాకారులచే కోల సంబరం, వీరభద్రుని సంబరం, మ్యూజికల్ బ్యాండ్, పులి వేషాలు ప్రదర్శించారు. వేట్లపాలెం కళాకారులచే డప్పుల డ్యాన్సు, శ్రీరంగపట్నం వారిచే గోపాల నృత్యం, కాకినాడ కళాకారులచే తీన్‌మార్ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి, నెక్కంటి సాయిప్రసాద్, ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు, ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, గుణ్ణం చంద్రమౌళి, ట్రస్టు బోర్డు సభ్యులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. రథోత్సవ కమిటీ సభ్యులు, భక్త సంఘ నాయకులు, రైతు సంఘ నాయకులు, భక్తులకు సేవలందించారు. డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, 10 మంది ఎస్సైలు, 100 మంది పోలీసు కానిస్టేబుళ్లు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కోలాహలంగా భీమేశ్వర రథోత్సవం

పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర ఆలయంలో ఆదివారం భక్తుల తాకిడి కొనసాగింది. ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం సెలవు దినం కావడంతో ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శనివారం అర్ధరాత్రి స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, లింగోద్భవ కాల పూజలు పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో నిర్వహించారు. పూజల అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

చంద్రశేఖరస్వామి రథోత్సవం



రథోత్సవాన్ని ప్రారంభించిన ఆవాల రాజేశ్వరి తదితరులు

సామర్లకోట: స్థానిక పాత సామర్లకోటలోని బాలత్రిపుర సుందరి సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 16వ తేదీన స్వామి వారి కల్యాణం జరగడంతో మహాశివరాత్రి మరుసటి రోజున రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయ పండితులు డి.పాపయ్యశాస్త్రి, చీమలకొండ వెంకటరమణల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. రథోత్సవాన్ని రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీ నారాయణ, పంచారామ క్షేత్ర ట్రస్ట్ బోర్డు సభ్యురాలు కర్రి వెంకటలక్ష్మి ప్రారంభించారు. ఆలయం నుంచి పాత్రులవీధి, తిలక్‌చౌక్, మున్సిపల్ కార్యాలయం, బట్టల బజార్ పాత తహసీల్దార్ కార్యాలయం మీదుగా తిరిగి చంద్రశేఖరస్వామి ఆలయానికి రథోత్సవం చేరింది.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



అలరించిన కోలాట నృత్యాలు

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలో వేంచేసిన కుక్కుటేశ్వరస్వామి రథోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అలరించారు. విచిత్ర వేషధారణలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వామివారి రథోత్సవ ఊరేగింపులో ఏర్పాటు చేసిన గరగల కోలాటం, వీరభద్రుడి నృత్యాలు, విఘ్నేశ్వరుడు, తాటకి తదితర విచిత్ర వేషధారణలను చూసేందుకు భక్తులు ఎగబడ్డారు. ఈ నృత్యాలు, వేషధారణల్లో భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడ్డాయి.



ఆకట్టుకున్న విచిత్ర వేషధారణలు

ప్రశాంతంగా ఎస్సై రాత పరీక్షలు



ఆదిత్య కళాశాలలో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు



ప్రగతి కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్

- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు
- అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపిన ఆర్టీసీ

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆదివారం ఎస్సై రాత పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కాకినాడ జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలకు వచ్చే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. అభ్యర్థులు ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా సకాలంలో పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. 100 మంది పోలీస్ సిబ్బందితో పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగినట్టు తెలిపారు. పరీక్షల నిమిత్తం వచ్చిన అభ్యర్థులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపిందన్నారు. ఆదిత్య ఇంజినీరింగ్ క్యాంపస్‌లోని 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉదయం 10 గంటలకు జరిగిన పరీక్షకు 5650 మందికి గాను 5118 మంది అభ్యర్థులు, ప్రగతి క్యాంపస్‌లో 1152 మందికి గాను 1028 మంది పరీక్షలు రాశారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగిన పరీక్షలకు ఆదిత్యలో 5650 మందికి గాను 5114 మంది, ప్రగతిలో 1152 మందికి గాను 1027 మంది హాజరైనట్టు ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) పి.శ్రీనివాస్, పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళీ మోహన్, జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

దంత వైద్యులకు పురస్కారాలు

బోట్‌క్లబ్: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ జాతీయ స్థాయిలో ఉత్తమ అధ్యక్షుని పురస్కారంతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు అందించిన సేవలకు రెండు జాతీయ స్థాయి పురస్కారాలు అందుకున్నారు. ఆదివారం ముంబయిలోని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ భవనంలో జరిగిన జాతీయ పురస్కార వేడుకలో ఆయన ఈ పురస్కారాలు అందుకున్నారు. అడ్డాల మాట్లాడుతూ తనకు ఈ పురస్కారాలు రావడం ఎంతో సంతోషంగా ఉందని, అనునిత్యం తోడుగా నిలిచిన కుటుంబ సభ్యులకు, రాష్ట్ర ఇండియన్ డెంటల్ అసోసియేషన్, కాకినాడ అసోసియేషన్ సభ్యులకు, కాకినాడ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. భవిష్యత్‌లోను ఈ సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగిస్తానన్నారు.

ఉత్తమ దంత వైద్యురాలిగా తన్మయి రామచంద్ర

కాకినాడ రూరల్: ముంబైలో జరిగిన ఇండియన్ డెంటల్ అసోసియేషన్ జాతీయ అవార్డుల ప్రధానోత్సవంలో ఇంద్రపాలేనికి చెందిన దంత వైద్యురాలు పలివెల తన్మయి రామచంద్రకు ఉత్తమ అవార్డు వరించింది. 30 ఏళ్ళ లోపు బెస్ట్ డెంటిస్ట్ విభాగంలో తన్మయికి డాక్టర్ రతన్ హెచ్ అవార్డును అందించారని ఆదివారం ఆమె మీడియాకు తెలిపారు. అలాగే బెస్ట్ స్కూల్ హెల్త్ యాక్టివిటీస్‌కు మరో అవార్డును పొందినట్టు ఆమె తెలిపారు. అవార్డులను నేషనల్ డెంటల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టరు రవీంద్రసింగ్ కార్యదర్శి డాక్టరు అశోక్ దోల్టే నుంచి అందుకున్నట్టు చెప్పారు. అవార్డులను అందుకున్న కుమార్తె తన్మయిని తల్లిదండ్రులు పలివెల లక్ష్మి, రాజు అభినందించారు.



జాతీయ స్థాయి పురస్కారాలు అందుకుంటున్న డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, తన్మయ

మహిళలకు వైద్య శిబిరం

కాకినాడ: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి పేర్కొన్నారు. స్థానిక 43వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ జేడీ పవన్‌కుమార్ ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని మాజీ మేయర్ సుంకర శివప్రసన్నతో పాటు చంద్రకళాదీప్తి ప్రారంభించారు. శివప్రసన్న మాట్లాడుతూ మహిళల కోసం ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పవన్‌కుమార్ మాట్లాడుతూ మహిళలకు సుగర్, బీపీ, కంటి వైద్యం, మోకాళ్ల నొప్పులు, దగ్గు, థైరాయిడ్ వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించామన్నారు. డాక్టర్ అంబటి ప్రదీప్తి వైద్యసేవలు అందించారు. మాజీ కార్పొరేటర్ నల్లబెల్లి సుజాత గణేష్‌యూత్ సభ్యులతో పాటు స్థానిక నాయకులు సమ్మి సత్యవాణి, గుత్తుల వీరవేణి, కమ్మం గణేష్ పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న

ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

బోట్‌క్లబ్: పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్య పరిరక్షణకు రోటరీ అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు రోటరీ ఎలక్టెడ్ డిస్ట్రిక్ గవర్నర్ దత్త సుబ్బారావు (విజయవాడ) అన్నారు. రోటరీ డిస్ట్రిక్ పరిధిలో 2023–24 సంవత్సరానికి కొత్తగా ఎంపికైన సభ్యులతో స్వాగతం పేరిట కాకినాడ రోటరీ హాల్ ఆదివారం సమావేశం నిర్వహించారు. మానసిక స్థితిగతులతో పాటు మాదక ద్రవ్యాల విషయంలోను యువతీ, యువకులను చైతన్య పరిచేందుకు అవగాహన కార్యక్రమాలు, వ్యవసాయ సంబంధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి అంశానికి కమిటీలు ఏర్పాటు చేసి వాటిలో సేవా తత్పరతతో సమాజం పట్ల అవగాహన ఉన్న వ్యక్తులకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. తొలుత రోటరీ ప్రాంగణంలో ఉన్న రోటరీ వ్యవస్థాపకుడు పాల్ హారిస్ విగ్రహానికి నివాళులర్పించారు. రోటరీ మాజీ గవర్నర్లు కేవీఎస్ ఆంజనేయమూర్తి, ఎల్.సత్యనారాయణన్, డాక్టర్ పూషా, ఎస్‌వీఎస్‌రావు, వీరభద్రారెడ్డి పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం లోవ దేవస్థానంలో వేసవి చలువ పందిళ్లు వేస్తున్నారు. మెట్ల మార్గంలో పెద్ద అమ్మవారి విగ్రహం వద్ద ఇటీవల బాలాలయం నిర్మించడంతో భక్తులు దర్శించుకుంటున్నారు. క్యూలైన్లలో వేచి ఉండి అమ్మవారిని దర్శించే భక్తులు ఎండ దెబ్బ బారిన పడుతున్నారు. దీంతో బాలాలయం వరకూ తాటాకులతో చలువ పందిళ్లు వేస్తున్నట్టు లోవ దేవస్థానం ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఏటా మార్చిలో వేసే చలువ పందిళ్లను ఈ ఏడాది భక్తుల సౌకర్యార్థం ఫిబ్రవరిలోనే రూ.1.50 లక్షలతో వేస్తున్నట్టు చెప్పారు. రెండు రోజుల్లో పందిళ్లు వేసే పనులు పూర్తవుతాయని వివరించారు.

ఎస్‌జీఎఫ్ఐ టెన్నిస్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



ఎస్‌జీఎఫ్ఐ టెన్నిస్ పోటీలో రాణించిన క్రీడాకారులతో సంఘ కార్యదర్శి కుమార్

నాగమల్లితోట జంక్షన్: నరసారావు పేటలో జరిగిన పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–14, 17, 19 టెన్నిస్ పోటీల్లో కాకినాడ టెన్నిస్ అకాడమీ క్రీడాకారులు పలు విభాగాల్లో ప్రతిభ కనపరిచారని టెన్నిస్ సంఘ రాష్ట్ర కార్యదర్శి పీవీ రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. స్థానిక ఆర్ఎంసీ ప్రాంగణంలోని టెన్నిస్ కోర్టుల్లో శిక్షణ పొందుతున్న ప్రవల్లిక, హర్షిణి, నీరజ్, సాయి, మూర్తి, సాహిత్, అభినవ్, లోకేష్, లోచన, వేద, ఆశ్రిత పాల్గొన్నారు. అండర్–19 విభాగంలో శంకర్, అండర్–14 బాలికల విభాగంలో జి.మేధ రాష్ట్రస్థాయిలో ఐదో స్థానంలో నిలిచారని కుమార్ తెలిపారు.